సాక్షి
శ్రీకాకుళం
ఆదివారం । 25 । మే । 2025



తవ్వేస్తూ.. తరలిస్తూ..

ఆమదాలవలసలో ఇసుకాసురులు రెచ్చిపోతున్నారు. వందలాది లారీల్లో ఇసుక తరలిస్తున్నారు. - 8లో



మొబైల్‌లో మాట్లాడుతుండగా..

సెల్‌ఫోన్‌లో మాట్లాడుతుండగా ఓ వ్యక్తి పిడుగుపాటుకు గురయ్యాడు. అక్కడికక్కడే మృతిచెందాడు. - 8లో

కొనసాగుతున్న ఏపీ ఈఏపీసెట్

ఎచ్చెర్ల క్యాంపస్: ఏపీ ఈఏపీసెట్ - 2025 కొనసాగుతోంది. శనివారం చిలకపాలెంలోని శ్రీ శివానీ కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్‌లో 278 మందికి గాను 264 మంది విద్యార్థులు హాజరయ్యారు. ఎచ్చెర్లలోని శ్రీ వేంకటేశ్వరా ఇంజినీరింగ్ కాలేజ్‌లో జరిగిన పరీక్షకు 170 మందికి గాను 163 మంది హాజరయ్యారు. ఆదివారం పరీక్షకు సెలవు కాగా, సోమవారం నుంచి తిరిగి ప్రారంభం కానున్నాయి.

న్యూస్‌రీల్

హెచ్‌ఎంల సీనియారిటీ జాబితాపై నేడు అభ్యంతరాల స్వీకరణ

శ్రీకాకుళం న్యూకాలనీ: ఉపాధ్యాయ బదిలీల్లో భాగంగా ప్రధానోపాధ్యాయుల ప్రొవిజినల్ సీనియారిటీ జాబితా విడుదలైంది. పాఠశాల విద్య డైరెక్టర్ ఆదేశాల మేరకు ఉమ్మడి శ్రీకాకుళం జిల్లాలో ఉన్న ప్రభుత్వ, జిల్లా పరిషత్, మున్సిపల్ మేనేజ్‌మెంట్లలో పనిచేస్తున్న హెచ్‌ఎంలకు సాధారణ బదిలీ ప్రొవిజినల్ సీనియారిటీ జాబితాను విద్యాశాఖాధికారి అధికారిక వెబ్‌సైట్ డీఈఓఎస్‌కెఎల్.ఓఆర్జీ వెబ్‌పోర్టల్‌లో పొందుపర్చినట్టు డీఈఓ డాక్టర్ ఎస్.తిరుమల చైతన్య పేర్కొన్నారు. హెచ్‌ఎంలు తమ వివరాలను సరిచూసుకుని, సీనియారిటీ జాబితాపై ఎటువంటి అభ్యంతరాలు ఉన్నా.. నిర్దేశిత షెడ్యూల్ ప్రకారం ఈనెల 25వ తేదీన తగిన ఆధారాలతో ఆన్‌లైన్‌లో సమర్పించాల్సి ఉంటుందని డీఈఓ స్పష్టంచేశారు.

వాహనాలు తనిఖీ చేయాల్సిందే

- ఎక్సైజ్ శాఖ డిప్యూటీ కమిషనర్ శ్రీకాంత్‌రెడ్డి



వాహన తనిఖీలకు సంబంధించి సూచనలు చేస్తున్న డిప్యూటీ కమిషనర్ శ్రీకాంత్ రెడ్డి

ఇచ్ఛాపురం టౌన్: సరిహద్దులో ప్రతి వాహనాన్ని తనిఖీ చేయాలని ఎక్సైజ్ శాఖ డిప్యూటీ కమిషనర్ శ్రీకాంత్‌రెడ్డి తెలిపారు. ఆంధ్రా, ఒడిశా సరిహద్దులో పురుషోత్తపురం వద్ద ఉన్న చెక్‌పోస్టును శనివారం ఎక్సైజ్‌శాఖ డిప్యూటీ కమిషనర్ శ్రీకాంత్‌రెడ్డి, అసిస్టెంట్ కమిషనర్ రామచంద్రరావు తనిఖీ చేశారు. రోజుకు ఎన్ని వాహనాలు రాకపోకలు చేస్తున్నాయని వివరాలు అడిగి తెలుసుకున్నారు. తనిఖీలకు సంబంధించిన రికార్డులను పరిశీలించారు. అనంతరం సుమారు గంటపాటు డిప్యూటీ కమిషనర్, అసిస్టెంట్ కమిషనర్లు స్వయంగా వాహనాలను పరిశీలించారు. అక్కడ సీసీ కెమెరాల పనితీరును పరిశీలించారు. మద్యం, గంజాయి, నిషేధిత ఉత్పత్తుల రవాణా అడ్డుకోవాలని సూచించారు. తనిఖీల అనంతరం ఎక్సైజ్ శాఖ డిప్యూటీ కమిషనర్, అసిస్టెంట్ కమిషనర్ గంజాం ఎస్పీ డీఆర్ శ్రావణ్ వివేక్‌తో ఆయన బరంపురంలో చర్చలు జరిపారు. గంజాయి, మద్యం ఆంధ్రాలోకి రాకుండా తీసుకోవాల్సిన విధానంపై చర్చలు జరిపినట్టు ఎక్సైజ్ సీఐ దుర్గాప్రసాద్ తెలిపారు.

పోలీసుల చేతిలో బెట్టింగ్ పిలక!

- బెట్టింగ్ మాఫియా గుట్టు రట్టు చేసేందుకు పోలీసులకు సువర్ణావకాశం
- ఎస్పీ ఆదేశాలతో రంగంలోకి టాస్క్‌ఫోర్స్ పోలీసులు
- పక్కా సమాచారంతో శుక్రవారం ముగ్గురి పట్టివేత
- ఎచ్చెర్ల, శ్రీకాకుళం రూరల్ స్టేషన్‌లో ప్రస్తుతం విచారణ
- కీలక వ్యక్తి కోసం గాలింపు



సాక్షి ప్రతినిధి, శ్రీకాకుళం:

బెట్టింగ్ మాఫియా తీగ పోలీసుల చేతికి దొరికింది. ఇక డొంకను కదపాల్సి ఉంది. పక్కా సమాచారంతో ఎస్పీ ఆదేశాల మేరకు టాస్క్‌ఫోర్స్ పోలీసులు ముగ్గురిని పట్టుకున్నారు. వీరి ద్వారా బెట్టింగ్ గుట్టు రట్టు చేసే అవకాశం ఖాకీలకు దొరికింది. వీరిని విచారిస్తే మాఫియా బాగోతమంతా బయటపడుతుంది.


ప్రాణాలు తీసేస్తున్న బెట్టింగ్



'ఫోర్ కొడితే చప్పట్లు.. సిక్స్ కొడితే కేకలు.. వికెట్ పడితే అరుపులు.' క్రికెట్ మ్యాచ్ జరుగుతున్నప్పుడు క్రీడాభిమానులు ఆస్వాదించే అంశాలివి. కానీ క్రికెట్‌లో ప్రస్తుతం బెట్టింగ్ వికటాట్టహాసం చేస్తోంది. టాస్‌కు ముందు, టాస్ తర్వాత బౌలింగ్/బ్యాటింగ్ ఎంపికకు, బౌలింగ్ చేయక ముందు, బాలు పడినాక, బ్యాట్స్‌మెన్ బాలు కొట్టాక, ఇలా ప్రతి క్షణంలోనూ బెట్టింగుల్లో యువత మునిగి తేలుతోంది. ఐపీఎల్ సీజన్ వచ్చాక ఇది మరింత పెరిగింది. బెట్టింగ్ ముఠా కార్యకలాపాలు పెరిగిపోయాయి. వీరి ఉచ్చులో చిక్కుకుని పీకల్లోతు అప్పుల్లో కూరుకుపోతున్నారు. ఆటపై వ్యామోహం పెట్టుబడిగా మారింది. బెట్టింగ్ కోసం బంగారాన్ని కుదువపెట్టేవారు కొందరైతే, లోన్ యాప్‌లు, ప్రైవేటు ఫైనాన్సియర్ల వద్ద వడ్డీలకు తెచ్చే వారు మరికొందరు. ఓడిపోయాక అప్పుల ఊబిలో పడి ఆత్మహత్యలకు దారితీస్తున్న పరిస్థితి నెలకొంది. ఈ వ్యసనంలో ప్రధానంగా యువత, ఆటో డ్రైవర్లు, ప్రైవేటు ఉద్యోగులు, వ్యాపారులు చిక్కుకుపోతున్నారు. ప్రస్తుతం క్రికెట్ బెట్టింగ్ అంత ప్రమాదకరంగా తయారైంది. కానీ, బెట్టింగ్ రాయుళ్లు అదే ఉపాధిగా ఎంచుకున్నారు. క్రీడా అభిమానాన్ని మోసం ద్వారా క్యాష్ చేసుకుంటున్నారు. జిల్లాలో ఇదొక మాఫియాగా ప్రస్తుతం తయారైంది. వీరి నిర్వాకంతో ఎన్నో కుటుంబాలు ఛిద్రమైపోతున్నాయి.

ముగ్గురు.. దొరికారు..

శ్రీకాకుళం కేంద్రంగా బెట్టింగ్ మాఫియా కార్యకలాపాలు నిర్వహిస్తోంది. దీనిపై గత కొన్ని రోజులుగా ఆరా తీస్తున్న ఎస్పీ కేవీ మహేశ్వర రెడ్డి పక్కా సమాచారంతో బెట్టింగ్ రాయుళ్లపై గురిపెట్టారు. సంబంధింత పోలీసుస్టేషన్ల ఎస్‌ఐలు, సీఐలు, ఇతరత్రా అధికారులతో అయ్యే పనికాదని టాస్క్‌ఫోర్స్‌ను రంగంలోకి దించారు. దీంతో తమకొచ్చిన సమాచారంతో టాస్క్‌ఫోర్స్ బృందాలు శుక్రవారం రాత్రి ఐపీఎల్ మ్యాచ్ జరుగుతుండగా ముగ్గురు వ్యక్తులను పట్టుకున్నాయి. పక్కా నిఘాతో పాన్నాడలోని రెండు ఇళ్లలో తనిఖీలు నిర్వహించే సరికి కిశోర్, ధనుంజయ్, రాజేష్ అనే వ్యక్తులు పట్టుబడ్డారు. కిశోర్ అనే వ్యక్తి ఫోన్ల ద్వారా తమ ఏజెంట్ల నుంచి ఎవరెవరు ఎంత బెట్టింగ్ వేశారు అన్న వివరాలను తెలుసుకుని ఒక వ్యక్తితో పుస్తకంలో రాయిస్తుండగా పట్టుబడ్డాడు. ఇక, ధనుంజయ్ అనే వ్యక్తి కూడా ఎవరెవరు ఎంత బెట్టింగ్ వేశారు ఏయే టీంపై వేశారన్నది నమోదు చేస్తుండగా దొరికాడు.



నాటకీయ పరిణామాలు

ఈ ముగ్గుర్ని టాస్క్‌ఫోర్స్ కార్యాలయానికి తీసుకెళ్లి విచారిస్తుండగా అదే సమయంలో మాఫియాకు నాయకత్వం వహిస్తున్న ఓ వ్యక్తి పదేపదే ఒక నంబర్ నుంచి ఫోన్ చేశాడు. టాస్క్‌ఫోర్స్ బృందాలు ఆ ఫోన్ ఎత్తి ఎవరా అని ఆరా తీసినట్టు తెలిసింది. తాను దమ్మల వీధికి చెందిన వ్యక్తిని అని చెప్పడంతో టాస్క్‌ఫోర్స్ బృందాలకు విషయం బోధపడినట్టైంది. అదే సమయంలో మరో వ్యక్తి కూడా ఫోన్ చేసినట్టు సమాచారం. ఆ ఫోన్‌ను టాస్క్‌ఫోర్స్ ఎత్తే సమయంలో ఆ వ్యక్తి మాట్లాడుతూ ఏ టీమ్ మీద ఎంత రేటింగ్ ఉంది వంటి వివరాలు అడుగుతుండగా...ఇవతల మాట్లాడుతున్నది టాస్క్‌ఫోర్స్ పోలీసులు అని చెప్పడంతో ఫోన్ స్విచ్ ఆఫ్ చేసి పరారైనట్టు భోగట్టా.

ఎవరా శ్రీను.. ఏంటా కథ?

ఈ మొత్తం బెట్టింగ్ మాఫియాకు శ్రీను అనే వ్యక్తి సూత్రధారిగా ఉన్నట్టు తెలుస్తోంది. ఆ వ్యక్తి కోసం ఆరా తీయడం వల్లనే పట్టుకున్న వ్యక్తులను పోలీసులు బయట పెట్టలేదని సమాచారం. బెట్టింగ్ రాకెట్‌ను పూర్తిగా చేధించాలంటే పరారీలో ఉన్న శ్రీను అనే వ్యక్తే కీలకమని పోలీసులు భావిస్తున్నట్టు సమాచారం. ఆయన కోసం గాలిస్తున్నారు. పట్టుబడిన ముగ్గురిలో ఇద్దర్ని ఎచ్చెర్ల పోలీసు స్టేషన్‌లో, ఒకర్ని శ్రీకాకుళం రూరల్ పోలీసు స్టేషన్‌లో ఉంచి విచారిస్తున్నారు.

రంగంలోకి నేతలు



పట్టుబడిన వ్యక్తులకు బెట్టింగ్‌తోనే కాకుండా పేకాటతో కూడా సంబంధాలు ఉన్నాయని తెలుస్తోంది. అందులో భాగంగానే పేకాట రాయుళ్లు వారి కోసం తమదైన శైలిలో పావులు కదుపుతున్నారు. తమ తమ స్థాయిల్లో ఫోన్‌లు చేసి ఒత్తిళ్లు చేస్తున్నారు. కానీ ఫలించడం లేదు. విషయం ఎస్పీ దృష్టిలో ఉండటంతో విడిపించడం కుదరడం లేదు. నేరుగా ఎస్పీకి చెప్పే ధైర్యం చేయలేకపోవడం వల్ల దొరికిన వారికి ఉపశమనం దొరకడం లేదు. పట్టుబడ్డ వారిలో ఒకరు 'నేను టీడీపీ వాడిని.. త్వరలో జరిగే పంచాయతీ ఎన్నికల్లో పోటీ చేస్తాను.. నన్ను వదిలేయండి' అని ప్రాధేయపడుతున్నట్టు కూడా తెలిసింది.

సారనాథ్ హైదరాబాద్ కోణార్క్ గుండె నిండా జ్ఞాపకాలు



కోణార్క్‌లో..

శ్రీకాకుళం కల్చరల్:

వేసవి సెలవులు పిల్లలకు ఆనందాన్ని పంచడమే కాదు.. జ్ఞాపకాలనూ పంచుతాయి. వేసవిలో వెళ్లే టూర్లను పిల్లలు చాలాకాలం గుర్తు పెట్టుకుంటారు. వారి మనోవికాసానికి ఈ టూర్లు ఎంతో ఉపయోగపడతాయి. శ్రీహర్షిత అనే అమ్మాయి తన వేసవి జ్ఞాపకాల గురించి ఇలా వివరించింది.

'నేను శ్రీహర్షిత, మా నాన్న సుబ్రహ్మణ్యం ఆమదాలవలస మున్సిపాలిటీలో పనిచేస్తున్నారు. మా అమ్మ తిమ్మరాజు నీరజ హిందీ పండిట్‌గా శ్రీకాకుళం హైస్కూల్‌లో పనిచేస్తున్నారు. మేము ఈ వేసవిలో సారనాథ్, హైదరాబాద్, కోణార్క్ వెళ్లాం. సారనాథ్ భారతదేశంలో ముఖ్యమైన బౌద్ధ క్షేత్రాలలో ఒకటి. సారనాథ్‌లో బౌద్ధ మ్యూజియం భారత పురావస్తు శాఖ ఆధ్వర్యంలో నడుస్తోంది. ఈ మ్యూజియంలో చాలా పురాతన విగ్రహాలు, శిల్పాలు, శాసనాలు చూశాం. శిల్పకళ నన్ను ఎంతగానో ఆకట్టుకుంది. అక్కడి నుంచి కోణార్క్ దేవాలయం సందర్శించాం. దీన్ని 13వ శతాబ్దంలో గంగ వంశాధిపతి నరసింహ దేవుడు నిర్మించాడు. గోడలపైచెక్కిన శిల్పాలు అత్యంత సున్నితంగా, అద్భుతంగా అనిపించాయి. వీటిలోని శిల్పకళ నృత్య భంగిమలు, దేవతారూపాలు, పుష్పాల అలంకరణలు అద్భుతంగా ఉన్నాయి. దీన్ని యునెస్కో ప్రపంచ వారసత్వ సంపదగా గుర్తించింది. తర్వాత హైదరాబాద్ వెళ్లాం. చార్మినార్, మక్కా మసీదు, గోల్కొండ కోటను సందర్శించాం. మక్కా మసీదు పరిసరాల్లో ఉన్న పావురాలు నన్ను ఎంతగానో ఆకట్టుకున్నాయి. వాటికి చిన్న గింజలు కూడా వేశాను. గింజలు వేస్తుండగా అవి మన చుట్టు తిరిగిన అనుభూతి నేను ఎప్పటికీ మర్చిపోలేను. గోల్కొండ కోట ఖజానాల కోటగా ప్రసిద్ధి పొందినట్లు ఇక్కడి వారు చెబుతున్నారు. ఈ కోటలో కోహినూరు దొరికిందని కూడా చెప్పారు'.



సారనాథ్ బౌద్ధ క్షేత్రంలో..

50 ఇయర్స్ ఇండస్ ట్రీ



శ్రీకాకుళంలో కొత్త కలెక్టరేట్ నిర్మాణంలో భాగంగా 50 ఏళ్ల వృక్షాన్ని నరికేశారు. కానీ ఆ మోడు మళ్లీ చిగురిస్తోంది. మీకు నరకడం వస్తే.. నాకు చిగురించడం వచ్చని చెబుతోంది.

– సాక్షి ఫొటోగ్రాఫర్, శ్రీకాకుళం

కేశవరావు అంత్యక్రియలు రేపు

- మృతదేహం కోసం చత్తీస్‌గఢ్ వెళ్లిన సోదరుడు రామ్‌ప్రసాద్



సాక్షి ప్రతినిధి, శ్రీకాకుళం: మావోయిస్టు పార్టీ కేంద్ర కమిటీ కార్యదర్శి నంబాల కేశవరావు అంత్యక్రియలు ఈ నెల 26న జియ్యన్న పేటలో జరుగుతాయి. ఈ విషయాన్ని ప్రజా సంఘాల ప్రతినిధి పి.ప్రసాద్ వెల్లడించారు. కేశవరావు మృతదేహం కోసం ఆయన సోదరుడు రామ్ ప్రసాద్ శనివారం సాయంత్రం బయలుదేరి వెళ్లారు. ఆదివారం ఉదయం 5 గంటలకు చత్తీస్‌గఢ్‌లోని ఆస్పత్రికి చేరవచ్చని తెలిపారు. 10 గంటల తర్వాతే బాడీ ఇస్తారనే అంచనాతో ఉన్నామన్నారు. ఆదివారం అర్ధరాత్రి దాటాక మృతదేహం చేరే అవకాశం ఉందన్నారు. సోమవారం ఉదయం 8 గంటలకు జియ్యన్నపేటలో అంత్యక్రియలు జరుగుతాయని ప్రకటించారు.

జియ్యన్నపేటకు వెళ్లే రూట్ ఇది..

శ్రీకాకుళం నుంచి పలాస హైవేలో నరసన్నపేట నుంచి 10 నుంచి 12 కిలోమీటర్లు దాటిన తర్వాత కోటబొమ్మాళి మండల కేంద్రం (కొత్తపేట జంక్షన్) వస్తుంది. అనంతరం మరో ఆరేడు కిలోమీటర్లు దాటిన తర్వాత జియ్యన్న పేట ఊరి పేరిట రోడ్ మీద ఒక నేమ్ బోర్డు కూడా ఉంటుంది. అక్కడ నుంచి ఎడమ వైపు (పడమర దిక్కు) కిలోమీటరు లోపు ఈ ఊరు ఉంటుంది. హైవే పై నుంచి కూడా ఆ ఊరు కనిపిస్తుంది.

గ్రామాలు ఆర్థిక పరిపుష్టి సాధించాలి: కలెక్టర్

శ్రీకాకుళం పాతబస్టాండ్: జిల్లాలోని ప్రతి గ్రామాన్ని ఆర్థికంగా బలోపేతం చేయడానికి ప్రణాళికాబద్ధంగా ముందుకు సాగాలని కలెక్టర్ డాక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ అధికారులను ఆదేశించారు. శనివారం కలెక్టర్ కార్యాలయంలో జరిగిన ప్రైమరీ సెక్టార్స్ (ప్రాథమిక రంగం) పై సమీక్ష సమావేశంలో ఆయన వివిధ శాఖల అధికారులకు దిశానిర్దేశం చేశారు. వ్యవసాయం, ఉద్యానవన, సెరీకల్చర్, వంశధార, ఏపీఎంఐడీసీ వంటి కీలక శాఖల అధికారులతో కలెక్టర్ పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా పలు అంశాలపై సమగ్రంగా చర్చించారు. గ్రామాల సామాజిక, ఆర్థిక పరిస్థితులను, వనరులను గుర్తించి, వాటిని సద్వినియోగం చేసుకునేందుకు కార్యాచరణ ప్రణాళికలు రూపొందించాలని సూచించారు. మండలంలో ఒక గ్రామాన్ని పైలెట్ ప్రాజెక్టుగా ఎంపిక చేసి ప్రకృతి వ్యవసాయాన్ని ప్రారంభించాలని సూచించారు. వ్యవసాయం, ఉద్యానం, పాడిపరిశ్రమ, మత్స్య, పౌల్ట్రీ, పట్టుపరిశ్రమ, సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమలు, స్వయం సహాయక సంఘాలు, బ్యాంకుల భాగస్వామ్యంతో గ్రామాల్లో సమగ్ర ఆర్థిక పరిపుష్టి సాధించడం ముఖ్యమని కలెక్టర్ స్పష్టం చేశారు.

సాయిల్ వెల్త్ ప్రాసెసింగ్ సెంటర్ల బలోపేతం, రైతు ఉత్పత్తిదారుల సంఘాల (ఎఫ్‌పీఓలు) బలోపేతం, ఫారం పాండ్ల పరిధిలో ఉద్యాన మొక్కలతో కొత్త ఎకో సిస్టమ్ ఏర్పాటుపై దృష్టి సారించాలని, డ్రోన్ల వినియోగం పెంచాలని కలెక్టర్ ఆదేశించారు. తక్కువ వర్షపాతం నమోదవుతున్న నేపథ్యంలో సూక్ష్మ సాగు (మైక్రో ఇరిగేషన్) ద్వారా సాగుబడిని విస్తరించాల్సిన అవసరాన్ని ఆయన గుర్తు చేశారు.

కొక్కొరోకో.. కథ వినుకో



- యెన్నిరామన్న పేటలో కనిపించని కోళ్ల పెంపకం
- పెద్దలు చేసిన తీర్మానమే కారణం

కొత్తూరు: కోడి కూతతో నిద్ర లేవడం పల్లెటూర్లకు అనాదిగా అలవాటు. కానీ కొత్తూరు మండలం యెన్నిరామన్నపేట మాత్రం కోడి కూత లేకుండానే ఉదయాలు గడుపుతోంది. ఇక్కడి ప్రజలు దశాబ్దాల కాలంగా నాటుకోళ్ల పెంపకానికి దూరంగా ఉన్నారు. చదవడానికి వింతగా ఉన్నా ఇది వాస్తవం. ఈ గ్రామంలో ఎవరూ కోళ్లను పెంచరు. పండగలు, పబ్బాలప్పుడు మొక్కులు చెల్లించాలనుకుంటే ముందు రోజు బయట నుంచి కోళ్లు తెచ్చుకుని మొక్కులు చెల్లించుకుంటారు.

ఈ గ్రామంలో గతంలో పూరిళ్లు చాలా ఎక్కువగా ఉండేవి. కోళ్లు కూడా అధికంగానే ఉండేవి. అయితే కోళ్లు ఇళ్ల మీదకు ఎక్కి ధ్వంసం చేసేసేవి. దీని వల్ల పూరిళ్లు వానా కాలంలో కారిపోవడంతో పాటు కోళ్ల వల్ల ప్రజల మధ్య గొడవలు కూడా జరిగేవి. దీంతో అప్పటి గ్రామ పెద్దలంతా కలిసి ఇకపై ఊరిలో కోళ్లు పెంచకూడదని తీర్మానించారు. ఆ తీర్మానాన్ని ఇప్పటికీ ఈ గ్రామం పాటిస్తోంది.

ఇది పెద్దల తీర్మానం



గ్రామంలో కోళ్లు పెంచకూడదని సుమారు 80ఏళ్ల కిందట నిర్ణయం తీసుకున్నట్లు మా పెద్దలు చెప్పారు. పెద్దలు చేసిన తీర్మానం మేరకు నేటికి కూడా గ్రామంలో కోళ్లు పెంచడం లేదు.

– టి.మధుబాబు, యెన్నిరామన్న పేట

రిమ్స్‌లో కోవిడ్ వార్డు

- వెంటిలేటర్, ఆక్సిజన్ ఏర్పాట్లతో పది పడకలు సిద్ధం
- అవసరమైతే మరిన్ని పడకలు ఏర్పాటు చేసేందుకు సన్నాహాలు

శ్రీకాకుళం:

శ్రీకాకుళం రిమ్స్‌లో కోవిడ్ రోగుల కోసం పది పడకలతో ప్రత్యేక వార్డును సిద్ధం చేశారు. ఆక్సిజన్, వెంటిలేటర్ సౌకర్యాలతో ఈ పది పడకలను ఏర్పాటు చేశారు. ప్రపంచాన్ని గతంలో రెండు విడతల్లో అతలాకుతలం చేసిన కరోనా ఇటీవల కాలంలో అనేక దేశాల్లో, మన దేశంలోని కొన్ని రాష్ట్రాల్లో నమోదవుతూ వస్తోంది. రెండు రోజుల కిందట విశాఖపట్నంలో కూడా రెండు కేసులు నమోదు కావడంతో జిల్లా యంత్రాంగం అప్రమత్తమై వైద్యాధికారులను తగిన ఏర్పాట్లు చేయాలని ఆదేశించింది. దీంతో వార్డును సిద్ధం చేసిన రిమ్స్ అధికారులు పరీక్ష కోసం అవసరమైన కిట్లు లేకపోవడంతో వాటిని పంపించాలని జిల్లా వైద్యారోగ్యశాఖాధికారికి లేఖ రాశారు. రెండు రోజుల్లో కిట్లు రిమ్స్‌కు చేరే అవకాశాలున్నాయి. వ్యాధి నివారణ కోసం ప్రాథమికంగా వినియోగించే మందులు ఇప్పటికే సిద్ధంగా ఉన్నప్పటికీ వ్యాధి తీవ్ర రూపం దాల్చితే మందులు లేకపోవడంతో వాటి కోసం కూడా ఎదురు చూస్తున్నారు. ప్రస్తుతం ఉన్న వేరియంట్‌కు అనుబంధంగా చికిత్స చేయాల్సి ఉండటం, ఏ మందులు వినియోగించాలో కేంద్ర స్థాయి నుంచి ఆదేశాలు రావాల్సి ఉండటంతో వాటి కోసం ఎదురు చూస్తున్నారు.

రోగి నుంచి సేకరించిన నమూనాను పరీక్షించేందుకు అవసరమైన యంత్రాలు ఎనిమిది వరకు ఉన్నప్పటికీ వాటిలో మూడు మాత్రమే పనిచేస్తున్నాయి. మిగిలిన వాటిని ఏం చేయాలన్న దానిపై రాష్ట్రానికి నివేదిక పంపించారు. ఇదిలా ఉంటే గతంలో గ్రామ స్థాయిలోనే పరీక్షలు జరిపేందుకు అవసరమైన ఏర్పాట్లను అప్పటి వైఎస్సార్ సీపీ ప్రభుత్వం చేసింది. ఈ సారి అలా కాకుండా వ్యాధి లక్షణాలుంటే సంబంధిత రోగి నుంచి సబ్‌సెంటర్లు, ఏరియా ఆస్పత్రుల్లో నమూనాలు సేకరించి జిల్లా కేంద్రంలోని రిమ్స్‌లో మాత్రమే పరీక్షలు చేయనున్నారు.



రిమ్స్‌లో కోవిడ్ రోగుల కోసం ఏర్పాటు చేసిన ప్రత్యేక గది

అప్రమత్తత అవసరం



- కోవిడ్ విస్తరిస్తున్న నేపథ్యంలో జిల్లా ప్రజలు అప్రమత్తంగా ఉండాల్సిన అవసరముంది.
- గతంలోలాగానే ఎప్పటికప్పుడు చేతులు శుభ్రం చేసుకోవడం, సామాజిక దూరం పాటించడం, మాస్కు వినియోగించడం వంటివి చేస్తూ ఉండాలి.
- తప్పనిసరి పరిస్థితుల్లో మాత్రమే ఇతర ప్రాంతాలకు రాకపోకలు సాగించాలి.
- సభలు, సమావేశాలు శుభకార్యాలకు దూరంగా ఉండటం అవసరం.
- జలుబు, దగ్గు, జ్వరం, గొంతునొప్పి, తలనొప్పి, కళ్లమంటలు వంటి లక్షణాలు కనిపిస్తే తక్షణం కోవిడ్ పరీక్ష చేసుకోవాలి.

ప్రత్యేక వార్డు ఏర్పాటు చేశాం



వెంటిలేటర్, ఆక్సిజన్ సౌకర్యంతో పది పడకల ప్రత్యేక వార్డును సిద్ధం చేశాం. అవసరమైతే మరిన్ని పడకలు ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకున్నాం. ఒకటి రెండు రోజుల్లో పరీక్ష కిట్లు, మందులు వచ్చే అవకాశాలున్నాయి.

– డాక్టర్ అమూల్య, సూపరింటెండెంట్, రిమ్స్

జిల్లా స్థాయిలోనే పరీక్షలు



జిల్లాలో ఎక్కడ వ్యాధి లక్షణాలు కనిపించినా నమూనాలు సేకరించి జిల్లా స్థాయిలోనే పరీక్షలు, చికిత్స అందజేస్తాం. రిమ్స్‌లో ఇందుకు తగ్గ ఏర్పాట్లు జరుగుతున్నాయి. వైద్యులమంతా అప్రమత్తంగా ఉన్నాం. వ్యాధి లక్షణాలు కనిపిస్తే పరీక్ష తప్పనిసరిగా చేసుకోవాలి.

– డాక్టర్ అనిత, జిల్లా వైద్యారోగ్యశాఖాధికారి.

27న ఆదిత్యుని హుండీ కానుకల లెక్కింపు

అరసవల్లి: అరసవల్లి సూర్యనారాయణ స్వామి ఆలయంలో హుండీ కానుకల లెక్కింపు ప్రక్రియ అనివెట్టి మండపంలో ఈనెల 27న ఉదయం 8.30 గంటల నుంచి జరుగుతుందని ఆలయ ఈఓ వై.భద్రాజీ తెలియజేసారు. ఈ మేరకు గతంలో వచ్చిన ఆరోపణల దృష్ట్యా విధుల నిర్వహణలో ఎలాంటి లోపాలు లేకుండా చర్యలు చేపడతామని, పోలీస్, రెవెన్యూ తదితర శాఖల సిబ్బంది సహకారంతో సజావుగా నిబంధనల ప్రకారం హుండీ కానుకల లెక్కింపు చేపడతామని ఆయన స్పష్టం చేశారు.

క్లుప్తంగా

కె.కొత్తూరులో దొంగల హల్‌చల్

టెక్కలి రూరల్: మండలంలోని కె.కొత్తూరు గ్రామంలో శనివారం వేకువజామున దొంగలు హల్‌చల్ సృష్టించారు. స్థానికులు గుర్తించి కేకలు వెయ్యడంతో వారు తమతో తెచ్చుకున్న కత్తిని చూపించి గ్రామస్తులను భయపెట్టే ప్రయత్నం చేయగా అందులో ఓ యువకుడిని గ్రామస్తులు పట్టుకున్నారు. అనంతరం ఆ యువకుడికి దేహశుద్ధి చేసి పోలీసులకు అప్పగించారు. ఈ ఘటనపై పోలీసులు వివరాలు ఆరా తీస్తున్నారు. కొద్దిరోజుల కిందట నందిగాం మండలం తామరాపల్లి వద్ద లారీ డ్రైవర్లను కత్తితో బెదిరించి డబ్బులు తీసుకున్న వ్యక్తులు, కె.కొత్తూరులో చోరీకి పాల్పడిన వ్యక్తులు ఒక్కరేనా అన్నదానిపై పోలీసులు విచారణ చేపడుతున్నారు.

మూడు ఇసుక ట్రాక్టర్లు సీజ్



గొట్టా బ్యారేజ్ వద్ద ఇసుక ట్రాక్టర్లను పట్టుకున్న తహసీల్దార్ హనుమంతరావు

హిరమండలం: మండలంలోని వంశధార గొట్టా బ్యారేజ్ దిగువ భాగంలో అక్రమంగా ఇసుక తరలిస్తున్న మూడు ట్రాక్టర్లను తహసీల్దార్ హనుమంతరావు సీజ్ చేశారు. శనివారం సాయంత్రం గొట్టా బ్యారేజ్ దిగువ భాగంలో ఇసుకను తరలిస్తున్న మూడు ట్రాక్టర్లను తహసీల్దార్, పోలీసులు సమన్వయంతో వెళ్లి పట్టుకున్నారు. తహసీల్దార్ మాట్లాడుతూ అక్రమంగా ఇసుకను తరలిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఆర్ఐ ఉమా శంకర్, వీర్వో భాస్కర్, పోలీసులు పాల్గొన్నారు.

కంప్యూటర్ అకౌంటెన్సీలో శిక్షణ

ఎచ్చెర్ల క్యాంపస్/ఎచ్చెర్ల: ఎచ్చెర్ల మండల కాంప్లెక్స్ ఆవరణలోని యూనియన్ బ్యాంకు స్వయం ఉపాధి శిక్షణ సంస్థలో ఇంటర్మీడియట్ అర్హత ఉన్న వారికి కంప్యూటర్ అకౌంటెన్సీలో ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు సంస్థ డైరెక్టర్ రామ్‌జీ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 30 నుంచి శిక్షణ ప్రారంభమవుతుందని పేర్కొన్నారు. 38 రోజుల పాటు ఉచిత శిక్షణ, వసతి, భోజన సౌకర్యాలు కల్పించనున్నట్లు తెలిపారు. ఉమ్మడి శ్రీకాకుళం జిల్లాకు చెందిన 19 నుంచి 45 ఏళ్ల యువత అర్హులని చెప్పారు. ఎంఎస్ ఆఫీస్, టాలీ, జీఎస్టీ వంటి అంశాలపై శిక్షణ ఇస్తామని, ఆసక్తి గల అభ్యర్థులు 7993340407, 9553410809 నంబర్లను సంప్రదించవచ్చని పేర్కొన్నారు.

కారు ఢీకొని వ్యక్తి దుర్మరణం



నారాయణరావు(ఫైల్)

నందిగాం: కొత్తగ్రహారం జాతీయ రహదారిపై శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో బడగాం పంచాయతీ శారదాపురం గ్రామానికి చెందిన బూరె నారాయణరావు (59) మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. నారాయణరావు టెక్కలి నుంచి పలాస వైపు తన ద్విచక్రవాహనంపై వెళ్తూ కొత్తగ్రహారం మీడియం ఓపెన్ వద్ద యూటర్న్ తీసుకుంటుండగా పలాస నుంచి టెక్కలి వైపు వెళ్తున్న కారు బలంగా ఢీకొట్టింది. ఈ ఘటనలో నారాయణరావు ఎగిరిపడటంతో తలకు తీవ్రగాయమైంది. స్థానికులు స్పందించి హైవే అంబులెన్స్‌లో టెక్కలి జిల్లా కేంద్ర ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు. నారాయణరావుకు భార్య, వివాహమైన ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. మృతుడి భార్య పద్మావతి ఇచ్చిన ఫిర్యాదు మేరకు హెచ్‌సీ వెంకటరమణ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

సెల్‌ఫోన్‌లో మాట్లాడుతుండగా..

- పిడుగుపాటుకు యువకుడు బలి



మృతిచెందిన శివ

టెక్కలి రూరల్: బన్నువాడ పంచాయతీ పితాపురం గ్రామ సమీపంలో శనివారం సాయంత్రం పిడుగు పాటుకు గురై మోర్పి శివ(26) అనే యువకుడు మృతిచెందాడు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. సంతబొమ్మాళి మండలం పెద్దకేసినాయుడుపేటకు చెందిన శివ పితాపురం సమీపంలో పోర్టు రోడ్డు నిర్మాణంలో భాగంగా జరుగుతున్న వంతెన పనులకు శనివారం హాజరయ్యాడు. సాయంత్రం ఒక్కసారిగా వర్షం పడటంతో పనులు ఆపి అదే ప్రాంతంలో సెల్‌ఫోన్‌లో మాట్లాడుతుండగా ఒక్కసారిగా పిడుగు పడటంతో అక్కడికక్కడే కుప్పకూలిపోయాడు. తోటి సిబ్బంది వెంటనే టెక్కలి జిల్లా ఆస్పత్రికి తరలించగా అప్పటికే శివ మృతిచెందాడు. ఈ ఘటనపై టెక్కలి పోలీసులు వివరాలు సేకరించారు. ఒక్కగానొక్క కుమారుడు మృతిచెందడంతో కుటుంబసభ్యులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు.

ఏపీఆర్‌డీసీలో ఉత్తమ ఫలితాలు

రణస్థలం: ఏపీ రెసిడెన్షియల్ డిగ్రీ ఫలితాల్లో రణస్థలం ఆదర్శ పాఠశాల విద్యార్థులు ఉత్తమ ర్యాంకులు సాధించారని ప్రిన్సిపాల్ పొట్నూరు శ్రీధర్ శని వారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇంటర్ ద్వితీయ సంవత్సరం బైపీసీ విద్యార్థి గొర్లె గణేష్ 7వ ర్యాంకు, సీహెచ్ చైతన్య 13వ ర్యాంకు, సీఈసీ విద్యార్థి ఎం.తేజేశ్వరరావు 19వ ర్యాంకు సాధించారని పేర్కొన్నారు. వీరిని అధ్యాపకులు అభినందించారు.

గంద్రేడు-బెలమాం-తొగరాం సమీపంలో జేసీబీలతో ఇసుకను తవ్వుతున్న దృశ్యం



తవ్వేస్తూ.. తరలిస్తూ.!

- చెలరేగిపోతున్న ఇసుక అక్రమార్కులు
- టీడీపీ నాయకులకు రూ.కోట్లు కురిపిస్తున్న అక్రమ ఇసుక ర్యాంపులు
- నిత్యం వందలాది లారీల్లో తరలిపోతున్న ఇసుక

పొందూరు/ఆమదాలవలస రూరల్:

కూటమి ప్రభుత్వం వచ్చాక ఆమదాలవలస నియోజకవర్గంలో ఇసుక బకాసురులు పేట్రేగిపోతున్నారు. పొందూరు, ఆమదాలవలస, బూర్జ, సరుబుజ్జిలి మండలాల్లో విచ్చలవిడిగా ఇసుక అక్రమ రవాణా సాగిస్తున్నారు. రాత్రీ పగలు అనే తేడా లేకుండా ఇసుక తరలిస్తూ కోట్లాది రూపాయలు జేబులు నింపుకుంటున్నారు. నాగావళీ నదీ పరీవాహక ప్రాంతాల్లో ఉన్న కొందరు టీడీపీ నాయకులు ఇసుక వ్యాపారులుగా మారి ఇష్టారాజ్యంగా అక్రమ రవాణా వ్యాపారానికి తెరతీశారు. ఈ క్రమంలో ముఖ్యనేతలకు సైతం వాటాలు వెళ్తున్నాయనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. నిత్యం ఇసుక లారీలు తిరుగుతుండటంతో స్థానిక ప్రజలు బెంబేలెత్తిపోతున్నారు.



నెల్లిమెట్ట వద్ద ఇసుకను డంప్ చేస్తున్న దృశ్యం

బుజ్జిలి మండలంలోని పురుషోత్తపురం-1, 2తో పాటు పొందూరు-ఆమదాలవలస మండలాల సరిహద్దు ప్రాంతమైన బెలమాం, తొగరాం, గంద్రేడులో ఇసుక అక్రమ తవ్వకాలు జోరుగా సాగుతున్నాయి. నిబంధనలకు విరుద్ధంగా జేసీబీలతో ఇసుకను తవ్వేస్తున్నారు. వందల సంఖ్యలో లారీలు, ట్రాక్టర్ల ద్వారా ఇసుకను దూరప్రాంతాలకు రవాణా చేస్తున్నారు. దీంతో రోడ్లన్నీ ఇసుకమయంగా మారిపోతున్నాయి. కొన్నిసార్లు ద్విచక్రవాహనదారులు ఇసుక కారణంగా జారిపడి ప్రమాదాల బారిన పడుతున్నారు.

పరిశీలిస్తాం..

అధికారికంగా పొందూరు మండలంలోని ఇసుక ర్యాంపులు లేవు. గతంలో వచ్చిన ఫిర్యాదు మేరకు బెలమాం, సింగూరులో పరిశీలించినప్పుడు నదుల్లో ఎటువంటి మెషీన్లు కనిపించలేదు. నదుల్లో యంత్రాలతో ఇసుకను తవ్వితే చర్యలు తీసుకుంటాం.

– వెంకటేష్ రామానుజుల, తహశీల్దార్, పొందూరు

రోడ్లు ఇసుకమయం..

పొందూరు మండలంలోని బొడ్డేపల్లి, సింగూరు, ఆమదాలవలస మండలంలో నిమ్మతొర్లాడ, దూసి, తోటాడ, ముద్దాడపేట, కొత్తవలస, నెల్లిమెట్ట, బూర్జ మండలంలో నారాయణపురం, అల్లెన, సరు

తోటల్లో ఇసుక దిబ్బలు....

ఇసుక ర్యాంపులకు సమీప తోటలు, రహదారులకు ఆనుకుని ఉన్న ఖాళీ ప్రాంతాల్లో ఇసుకను ట్రాక్టర్లతో డంప్ చేస్తున్నారు. గంద్రేడు-బెలమాం తోటలు, మొదలవలస ప్రధాన రహదారి, నెల్లిమెట్టకు వెళ్లే దారిలో భారీగా డంపింగ్ అవుతోంది. ఆయా ప్రాంతాల నుంచి లారీలతో ఇసుకను తరలిస్తున్నారు. నేరుగా ఇసుక ర్యాంపుల్లోకి సైతం లారీలు వెళ్తున్నాయి. ట్రాక్టర్ ఇసుకను రూ.2000 నుంచి రూ.3000 వరకు అమ్ముతున్నారు. ఈ విధంగా కొందరు టీడీపీ నాయకులు భారీగా జేబులు నింపుకొంటున్నారు. ఇప్పటికైనా భూగర్భ, గనుల, రెవెన్యూ, పోలీసు శాఖలు స్పందించి ఉచిత ఇసుక విధానానికి విరుద్ధంగా వ్యాపారం సాగిస్తున్న ఇసుక అక్రమార్కులపై చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.



గంద్రేడు-బెలమాం మధ్య మామిడి తోటల్లో నిల్వలు

చోరీ కేసుల్లో నిందితుల అరెస్టు

ఎచ్చెర్ల క్యాంపస్: ఎచ్చెర్ల పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగిన వేర్వేరు దొంగతనం కేసుల్లో నిందితులను ఎచ్చెర్ల ఎస్సై వి.సందీప్‌కుమార్ శనివారం అరెస్టు చేశారు. ఈ నెల 12న కేశవరావుపేటలో జాతీయ రహదారికి ఆనుకొని ఉన్న తాళం వేసి ఉన్న ఇంట్లో చోరీ జరిగింది. ఇనుప రాడ్డుతో తాళం, బీరువా పగలగొట్టి నిందితుడు బంగారు ఆభరణాలు కాజేశాడు. ఘటనా స్థలంలో లభించిన ఆధారాలు ఆధారంగా విశాఖ జిల్లాకు చెందిన పి.నాగరాజు, గురయ్యలను నిందితులుగా గుర్తించి అరెస్టు చేశారు.

జల్సాలకు అలవాటు పడి..

పూడివలస సమీపంలో కింతలి రోడ్డులో ఉన్న ధనలక్ష్మి ఎంటర్‌ప్రైజెస్ (మందుగుండు సామగ్రి) దుకాణంలో ఈ నెల 15న చోరీ జరిగింది. జల్సాలకు అవాటుపడిన రవికుమార్, కోమలరావు అనే యువకులు క్యాష్ కౌంటర్‌లో రూ.10 వేలు చోరీ చేశారు. సీసీ కెమెరాల్లో నిక్షిప్తమైన దృశ్యాలు ఆధారంగా పోలీసులు దర్యాప్తు చేసి నిందితులను శనివారం అరెస్టు చేశారు.

అసిరిపోలమ్మ ఆలయంలో..

ఎచ్చెర్ల మండలం ముద్దాడలోని అసిరిపోలమ్మ ఆలయం తాళాలను ఈ నెల 19న రవికుమార్, కోమలరావు, మోహన్‌నాయుడు, సింహాచలం పగలుగొట్టి లోపలికి ప్రవేశించి బంగారు, వెండి ఆభరణాలు చోరీ చేశారు. నిందితులను శనివారం అరెస్టు చేశారు.

బూటకపు ఎన్‌కౌంటర్లు సిగ్గుచేటు



రౌండ్‌టేబుల్ సమావేశంలో మాట్లాడుతున్న సీపీఐ (ఎంఎల్) రాష్ట్ర అధికార ప్రతినిధి పి.ప్రసాద్

- రౌండ్‌టేబుల్ సమావేశంలో వక్తల మండిపాటు

శ్రీకాకుళం (పీఎన్ కాలనీ): సీపీఐ(మావోయిస్టు) పార్టీ కేంద్ర కమిటీ ప్రధాన కార్యదర్శి నంబాల కేశవరావుతో సహా అనేక మందిని హత్య చేసిన మోదీ ప్రభుత్వం ఏదో ఘనకార్యం సాధించినట్లు చెప్పుకోవడం సిగ్గుచేటని వక్తలు మండిపడ్డారు. శనివారం శ్రీకాకుళం నగరంలోని ఏపీ ఎన్జీఓ హోంలో వామపక్ష నేతలు రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించి పలు తీర్మానాలు చేసి ఆమోదించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ఫాసిస్టు చర్యలను వీడకపోతే మూల్యం చెల్లించుకోక తప్పదని హెచ్చరించారు. తక్షణమే వారి మృతదేహాలను బంధువులకు అప్పగించాలని కోరారు. శాంతియుతంగా చర్చలకు కేంద్ర ప్రభుత్వం దిగిరావాలన్నారు. నంబాల కేశవరావుతో పాటు ఆదివాసీలను బూటకపు ఎన్‌కౌంటర్ చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. నారాయణపూర్‌తో సహా అడవుల్లో సాగిస్తున్న మారణహోమంపై సుప్రీంకోర్టు సిటింగ్ జడ్జితో న్యాయ విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. ఆపరేషన్ కగార్‌ను వెంటనే ఉపసంహరించుకోవాలన్నారు. ఖనిజ సంపదలు, ప్రకృతి వనరులతో కూడిన అడవులను బడా కార్పొరేట్లకు అప్పగించే ఆపరేషన్‌కు వ్యతిరేకంగా ప్రజాస్వామ్య ఉద్యమానికి శ్రీకారం చుడతామన్నారు. సీపీఐ(ఎం.ఎల్) న్యూడెమొక్రసీ జిల్లా కమిటీ జిల్లా కార్యదర్శి తాండ్ర ప్రకాష్ అధ్యక్షత జరిగిన సమావేశంలో వామపక్ష, వివిధ సంఘాల నాయకులు వంకల మాధవరావు, పి.ప్రసాద్, చిట్టిపాటి వెంకటేశ్వర్లు, చాపర వెంకటరమణ, దుప్పల గోవిందరావు, ఎం.రామారావు, గురవయ్య, ఎం.లక్ష్మి, పత్తిరి దానేషూ, కె.వి.జగన్నాథరావు, కోదండం, మద్దిల ధర్మారావు, కూర్మారావు, మిస్క కృష్ణయ్య, పి.పద్మ, కృష్ణవేణి, పోలా ఈశ్వరరావు ఎన్.నీలంరాజు తదితరులు పాల్గొన్నారు.

రజకుల జీవనాధారం దెబ్బతీస్తారా?



శాంతినగర్‌కాలనీ వద్ద దోబీఘాట్‌ను పరిశీలిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

శ్రీకాకుళం (పీఎన్ కాలనీ): నాలుగు తరాలుగా నాగావళి నదిని, దాని ఒడ్డును నమ్ముకొని జీవనం సాగిస్తున్న బలగ ప్రాంతంలోని రజకుల బతుకులతో కూటమి నేతలు ఆటలాడుకోవడం సరికాదని వైఎస్సార్ సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి గేదెల పురుషోత్తం అన్నారు. శాంతినగర్ కాలనీ వద్ద బలగ ప్రాంతంలో ఉన్న దోబీఘాట్‌ను పార్టీ నగర అధ్యక్షుడు సాధు వైకుంఠంతో కలిసి శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాలుగు తరాలుగా 80 కుటుంబాలు ఇక్కడ బతుకుతున్నాయని, అప్పటి మంత్రి ధర్మాన ప్రసాదరావు వీరి బతుకు తెరువు కోసం ప్రత్యేకంగా దోబీఘాట్‌లు నిర్మించారన్నారు. వాటిని మరింత అభివృద్ధి చేయాల్సిన కూటమి ప్రభుత్వం కూల్చేసి పార్కును కడతామనడం అన్యాయమన్నారు. 1976లోనే ఇక్కడ రజకుల కోసం నేలబావి, బండలను ఏర్పాటు చేశారని, నదీ గమనం మారిన తర్వాత నేరుగా నది ఒడ్డునే షెడ్డులు నిర్మించి దోబీఘాట్‌లను ధర్మాన ఏర్పాటు చేయించారని చెప్పారు. ఇప్పుడు వీటిని తొలగిస్తే రజక కుటుంబాలు రోడ్డున పడతాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఎమ్మెల్యేను కలిసి విన్నవించగా సగం భూమిని వదిలేయాలని చెప్పడం సరికాదన్నారు. బలగ, రిమ్స్ ప్రాంతానికి ఉన్న ఏకైక దోబీఘాట్‌ను తొలగిస్తే ఉద్యమం తప్పదన్నారు. ఈ విషయమై సోమవారం గ్రీవెన్స్‌సెల్‌లో కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తామని చెప్పారు. కార్యక్రమంలో బాణ్ణ పవన్, బట్ట సీతన్న తదితరులు పాల్గొన్నారు.

బీడు భూముల్లో తోటల పెంపకంతో ఆదాయం



రత్నాల వరప్రసాద్, ఉద్యానశాఖ ఏడీ

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): బీడుభూములను అనవసరంగా వదిలేయకుండా ఉద్యాన శాఖ సలహాలతో అనువైన తోట పంటలు వేసుకుంటే సుస్థిర ఆదాయం పొందవచ్చని ఉద్యానశాఖ ఏడీ ఆర్.వి.వి.ప్రసాద్ అన్నారు. ఈ మేరకు శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. జిల్లాలో 3,550 హెక్టార్ల బీడు భూములు ఉన్నాయని, వీటిని ఉద్యాన పంటల (తోటల) సాగుకు ఉపయోగిస్తే ఆయా భూముల విలువను పెంచడమే కాకుండా, సాగులో ఉన్న అనిశ్చితిని తగ్గించి దీర్ఘకాలిక ఆదాయం పొందే అవకాశం ఉంటుందని పేర్కొన్నారు. తోటల సాగు అంటే కేవలం మామిడి, జీడి మామిడి, కొబ్బరి మొదలైనవి మాత్రమే కాకుండా జామ, సీతాఫలం, నిమ్మ, నేరేడు, రేగు, మునగ, గులాబీ, మల్లి వంటి పూల సాగు, ఆయుర్వేద గుణాలు, సుగంధ తైల మొక్కల సాగూ ఇందులో భాగమేనన్నారు. తక్కువ నీటితో పెరిగే సామర్థ్యం కలిగి ఉండటంతో బీడుభూములకు ఎంతో అనుకూలంగా ఉంటాయన్నారు. 90 శాతం రాయితీపై డ్రిప్, స్ప్రింక్లర్లను అమర్చుకొనడం ద్వారా 60 – 80 శాతం నీటిని ఆదా చేసుకుని బీడు భూములను సస్యశ్యామలం చేసుకోవచ్చన్నారు.

ప్రగడపుట్టుగ శివాలయంలో చోరీ



ఆలయం వద్ద క్లూస్‌టీం పరిశీలన

కవిటి: ప్రగడపుట్టుగ గ్రామంలోని రామేశ్వర ఆలయంలో శుక్రవారం రాత్రి చోరీ జరిగింది. శనివారం ఉదయం ఆలయం తెరిచేందుకు ఆలయ పూజారి వెళ్లగా తలుపులు తెరిచి ఉండటంతో ధర్మకర్త బెందాళం రామ్‌ప్రసాద్‌కు సమాచారం అందించారు. లోపలికి వెళ్లి చూడగా శివుడు, వినాయకుని పంచలోహ ప్రతిమలు, ఇత్తడి వస్తువులను దుండగులు పట్టుకుపోయారు. రామ్‌ప్రసాద్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ రవివర్మ తెలిపారు. క్లూస్ టీమ్ వచ్చి వివరాలు సేకరించారు.

కాపుగోపాలపురంలో చోరీ



బీరువాను పరిశీలిస్తున్న క్లూస్ టీం

పాతపట్నం: కాపుగోపాలపురంలో బూసి జీవరత్నం ఇంట్లో శుక్రవారం రాత్రి చోరీ జరిగింది. ఎస్‌ఐ బి.లావణ్య, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. బూసి జీవరత్నం, దమయంతి దంపతులు శుక్రవారం రాత్రి భోజనం చేసి ఇంటి మేడపై నిద్రపోయారు. ఇదే అదనుగా గుర్తు తెలియని వ్యక్తులు ఇంట్లోకి ప్రవేశించి బీరువాలో ఉన్న రెండు తులాల బంగారం పుస్తెలతాడు దొంగిలించారు. శనివారం ఉదయం బీరువా తీసి ఉండటంతో దొంగతనం జరిగిందని బాధితులు గుర్తించారు. అనంతరం పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఎస్‌ఐ బి.లావణ్య టెక్కలి క్లూస్ టీమ్‌తో కలిసి ఘటనా స్థలాన్ని పరిశీలించారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని ఎస్‌ఐ తెలిపారు.

రామాలయం కోసమే మస్టర్లు వేశా..

సంతబొమ్మాళి: కాపుగోదాయవలస గ్రామంలో రామాలయం కోసమే ఉపాధి పని చేసినట్లు కొందరికి మస్టర్లను నమోదు చేశానని ఫీల్డ్ అసిస్టెంట్ అంగ ధనుంజయ శనివారం విలేకరులకు తెలిపారు. 'టీడీపీ నాయకులకు భలే ఉపాధి' శీర్షికన సాక్షి దినపత్రికలో శనివారం కథనం ప్రచురితం కావడంతో పలు వాస్తవాలు వెలుగుచూశాయి. రామాలయం కోసం గ్రామానికి చెందిన టీడీపీ నాయకులు కుత్తుమ శివప్రసాద్, సైనా ఉమాదేవి, దున్న చంద్రయ్య, సైనా బీష్మారావు, కారాడ ప్రభ తదితర పేర్లను మస్టర్లో నమోదు చేసినట్లు ఫీల్డ్ అసిస్టెంట్ అంగీకరించారు. ఈ విషయం ఉపాధి వేతనదారులకు, ఏపీవో పంగ నరసింహమూర్తికి ముందుగానే తెలియజేశానని, వీరంతా సమ్మతించారని ధనుంజయ తెలిపారు. ఇందులో తన తప్పేమీ లేదన్నారు. మరోవైపు, రామాలయం కోసం కొందరు పేర్లు మస్టర్‌లో నమోదు చేయటం ఏంటని, గ్రామంలో ఉన్న 200 మంది వేతనదారులు పేర్లు పనికి వెళ్లకుండా నమోదు చేసి వచ్చిన డబ్బులు రామాలయానికి ఇవ్వాలని వేతనదారులు అంటున్నారు.

ఈ విషయమై ఉపాధి హామీ పథకం ఏపీవో పంగ నరసింహమూర్తి స్పందిస్తూ సోమవారం విచారణ చేపతామని చెప్పారు.

వివాహ వేడుకలో కొట్లాట

మెళియాపుట్టి: మండలంలోని సిరియాఖండి గ్రామంలో శుక్రవారం రాత్రి జరిగిన పెళ్లి వేడుకలో డీజే నిర్వాహకులు, పెళ్లికి వచ్చిన బంధువర్గానికి మధ్య గొడవ జరిగి కొట్లాటకు దారితీసింది. పాతపట్నం సీఐ వి.రామారావు తెలిపిన వివరాల మేరకు.. పట్టుపురం గ్రామానికి చెందిన దాసరి సాయి కుమార్ అనే వ్యక్తి సిరియాఖండి గ్రామంలో జరిగిన పెళ్లి వేడుకకు వెళ్లాడు. రాత్రి సమయంలో పెళ్లి ఊరేగింపు కోసం తీసుకొచ్చిన డీజే వ్యాన్‌లో నిద్రపోయాడు. కొద్దిసేపటి తర్వాత డీజే యజమాని వెంకటరావు, మరికొందరు వచ్చి లేపి పంపించేశారు. ఇంతలోనే సాయికుమార్ డీజే వ్యాన్ డ్రైవ్ చేసుకుంటూ వెళ్లిపోవడంతో నిర్వాహకులు వెంబడించారు. వ్యాన్‌ను అడ్డుకుని సాయికుమార్‌ను దొంగగా భావించి డెకరేషన్ క్లాత్‌లతో కట్టేసి కొట్టారు. కొంతసేపటి తర్వాత సాయికుమార్ బంధువు వచ్చి గుర్తుపట్టి అడ్డుకోవడంతో.. తిరిగి సిరియాఖండిలోని పెళ్లి వద్దకు సాయికుమార్‌ను తీసుకొచ్చారు. గాయాలతో ఉన్న సాయిని చూసి తమ్ముడు ప్రదీప్ డీజే నిర్వాహకులపై దాడికి పాల్పడ్డాడు. ఇరువర్గాల ఫిర్యాదుల మేరకు పాతపట్నం సీఐ వి. రామారావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

యోగాతో సంపూర్ణ ఆరోగ్యం



లెక్చరర్లు, సిబ్బందితో కలిసి యోగాసనాలు వేస్తున్న అధికారులు

శ్రీకాకుళం న్యూకాలనీ: యోగాతో సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని ఇంటర్మీడియెట్ విద్య జిల్లా అధికారి ఆర్.సురేష్‌కుమార్ అన్నారు. జూన్ 21న అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని కేంద్ర రాష్ట్రప్రభుత్వాలు ప్రకటించిన యోగా మాసోత్సవంలో భాగంగా శనివారం శ్రీకాకుళం ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాల ప్రాంగణంలో యోగాంధ్రా-2025 కార్యక్రమం నిర్వహించారు. స్పాట్ వాల్యూషన్‌లో పాల్గొన్న ప్రిన్సిపాళ్లు, లెక్చరర్లతో కలిపి యోగాసనాలు వేశారు. ఈ సందర్భంగా డీఐఈఓ మాట్లాడుతూ ఇంటర్మీడియెట్ విద్యకు జూన్ 2, జూన్ 20వ తేదీలను యోగాకు కేటాయించారని, లెక్చరర్లు, విద్యార్థులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. అనంతరం ఆర్ఐఓ ప్రగడ దుర్గారావు ట్రైనర్‌గా వ్యవహరించి యోగాసనాలు వేశారు. కార్యక్రమంలో ఇంటర్‌విద్య యోగా జిల్లా కో-ఆర్డినేటర్ బి.శ్యామ్‌సుందర్, జి.వెంకటేశ్వరరావు, జి.ధనుంజయరావు, టి.జగదీశ్వరరావు, శ్యామలరావు తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ కాంప్లెక్స్‌లో సమస్యలపై ఆరా



కలెక్టర్‌కు కాంప్లెక్స్ పరిస్థితి వివరిస్తున్న డీపీటీవో విజయ్‌కుమార్

శ్రీకాకుళం అర్బన్: జిల్లా కేంద్రంలోని ఆర్టీసీ కాంప్లెక్స్‌లో ప్రయాణికులకు మరింత మెరుగైన సౌకర్యాలు అందించాలని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ ఆర్టీసీ అధికారులను ఆదేశించారు. శనివారం ఆర్టీసి కాంప్లెక్స్‌ను ఆకస్మికంగా సందర్శించారు. మరుగుదొడ్లు, తాగునీరు, పరిసరాల పరిశుభ్రతపై అధికారులకు పలు సూచనలిచ్చారు. ప్రయాణికుల సౌకర్యార్థం మరికొన్ని చోట్ల తాగునీటి సదుపాయాన్ని కల్పించాలని ఆదేశించారు. ప్రయాణికులతో మాట్లాడి సౌకర్యాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆర్టీసీ అధికారులతో కలెక్టర్ సమావేశమయ్యారు. కార్యక్రమంలో జిల్లా ప్రజా రవాణా అధికారి ఆకాశపు విజయకుమార్, ఒకటి, రెండు డిపోల మేనేజర్లు హనుమంతు అమరసింహుడు, కె.ఆర్.ఎస్.శర్మ, అసిస్టెంట్ మేనేజర్లు వి.రమేష్, ఎ.గంగరాజు, ఎస్ఎం ఎం.పి.రావు, అధికారులు ఎల్ఎస్ నాయుడు, రాజు, ప్రసాదరావు, సూపర్‌వైజర్లు, యూనియన్ ప్రతినిధులు పాల్గొన్నారు.